ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.
ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 51 | పేజీలు: 6 | వెల: రూ.3/- | గురువారం 4 జూన్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


## తెలంగాణలో పెరగనున్న
# భూముల విలువలు..
## జూన్ 5 నుంచి కొత్త రేట్లు!

**భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల మార్కెట్ విలువ సవరణ**

**పెరగనున్న స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు**

**శాస్త్రీయ పద్ధతిలో విలువలు సవరించినట్టు తెలిపిన మంత్రి పొంగులేటి**

**వాస్తవ ధరలకు అనుగుణంగా మార్పులు చేసినట్టు వెల్లడి**



**హైదరాబాద్, జూన్ 3 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల కొనుగోళ్లు మరింత భారం కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సవరించిన భూముల మార్కెట్ విలువలను జూన్ 5వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం ప్రకటించారు. వాస్తవ మార్కెట్ పరిస్థితులకు, ప్రభుత్వ విలువలకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సవరణ కోసం ప్రభుత్వం శాస్త్రీయమైన, పారదర్శకమైన విధానాన్ని అనుసరించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో క్షేత్రస్థాయి అధ్యయనాలు, రిజిస్ట్రేషన్ల డేటా విశ్లేషణ, నిపుణుల కమిటీల సూచనలను పరిగణనలోకి తీసుకున్నారు. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పారిశ్రామిక వృద్ధి, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని డిమాండ్‌ను ఆధారంగా చేసుకుని కొత్త విలువలను నిర్ధారించారు. కొత్త విధానం ప్రకారం, కొన్ని ప్రాంతాల్లో ..మిగతా 2లో



## సీఎం రేవంత్‌తో దక్షిణాఫ్రికా
# డిప్యూటీ ప్రెసిడెంట్ భేటీ

**తెలంగాణలో పెట్టుబడులు, వాణిజ్యంపై ప్రధానంగా చర్చలు**

**ఐటీ, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో సహకారానికి అంగీకారం**

**పెట్టుబడులకు పూర్తి సహకారం అందిస్తామని సీఎం రేవంత్ హామీ**

**హైదరాబాద్, జూన్ 3 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ, దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా కీలక అడుగుపడింది. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ షిపోకోసా పౌలస్ మషాటిలే బృందం సమావేశమైంది. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఈ భేటీలో ఇరుపక్షాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య అవకాశాలపై ప్రధానంగా చర్చించారు.

సమాచార సాంకేతికత (ఐటీ), ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం వంటి కీలక రంగాల్లో పరస్పర సహకారంపై చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే దక్షిణాఫ్రికా కంపెనీలకు, పారిశ్రామికవేత్తలకు పూర్తి మద్దతు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) హైదరాబాద్ కేంద్రంగా మారిందని, ప్రపంచస్థాయి వైద్య సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు దక్షిణాఫ్రికా ప్రతినిధి బృందాన్ని సీఎం ఆహ్వానించారు. ఈ ..మిగతా 2లో

## తెలంగాణ రాజకీయాలపై
# ఏపీలో పవన్ కీలక వ్యాఖ్యలు

**తెలంగాణ ఎవరి జాగీరు కాదన్న పవన్ కల్యాణ్**

**అమరావతిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులు**

**తెలంగాణ బిడ్డలు పోటీ చేస్తే అభ్యంతరం ఎందుకని ప్రశ్న**

**గత వైసీపీ పాలనలో కుల రాజకీయాలు పెరిగాయని విమర్శ**



**హైదరాబాద్, జూన్ 3 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ ఎవరి జాగీరు కాదని, అక్కడి రాజకీయాల్లో జనసేన భాగస్వామ్యంపై వస్తున్న విమర్శలకు అర్థం లేదని ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. బుధవారం అమరావతి పర్యటనలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో పోటీ చేసే హక్కు అక్కడి భూమిపుత్రులకే ఉంటుందని అనడం సరికాదని, ఇతరులు పోటీ చేయకూడదని అభ్యంతరాలు చెప్పడం తగదని ..మిగతా 2లో

## కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా
# డీకే శివకుమార్ బాధ్యతల స్వీకరణ


**వచ్చీరావడంతోనే వరాల జల్లు కురిపించిన డీకే శివకుమార్... తొలి ప్రకటన ఇదే!**

**బెంగళూరు రోడ్ల అభివృద్ధి కోసం రూ. 2000 కోట్ల నిధులు కేటాయింపు**

**అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకం**

**విద్యార్థులకు ఉచిత బస్ పాసులు, 50 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి హామీ**

**రాష్ట్రవ్యాప్తంగా 10 వేల 'భారత్ జోడో యువక సంఘాల' ఏర్పాటుకు నిర్ణయం**



**హైదరాబాద్, జూన్ 3 (ప్రభాత ఉదయం)**

కర్ణాటక కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన గంటల వ్యవధిలోనే డీకే శివకుమార్ కీలక నిర్ణయాలతో పాలనలో తనదైన ముద్ర వేశారు. సిద్ధరామయ్య రాజీనామా అనంతరం సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన, ముఖ్యంగా విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని వరాల జల్లు కురిపించారు. ఇవాళ (జూన్ 3న) బెంగళూరులోని లోక్ భవన్ గ్లాస్ హౌస్‌లో పార్టీ నేతలు, మత పెద్దల సమక్షంలో నిరాడంబరంగా జరిగిన కార్యక్రమంలో ఆయన సీఎంగా ప్రమాణం చేశారు. అధికారంలోకి వస్తూనే, రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులందరికీ ఉచిత బస్ పాసులు అందిస్తామని తొలి కీలక ప్రకటన చేసి విద్యార్థులకు శుభవార్త అందించారు. గతంలో ఉప ముఖ్యమంత్రిగా, ..మిగతా 2లో

# అవును, తెలంగాణ మా జాగీరే

**పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు గద్దర్ కూతురు కౌంటర్**

**తెలంగాణ మీ జాగీరా అన్న పవన్ వ్యాఖ్యలను ఖండించిన వెన్నెల**

**తెలంగాణ గడ్డ నిన్న, నేడు, రేపు మా జాగీరేనంటూ కౌంటర్**

**తెలంగాణ పోరాటాలతో, ఆత్మబలిదానాలతో వచ్చిందన్న వెన్నెల**

**హైదరాబాద్, జూన్ 3 (ప్రభాత ఉదయం)**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై గద్దర్ కూతురు వెన్నెల తీవ్రంగా స్పందించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున పవన్ మాట్లాడిన మాటలు తెలంగాణ అస్తిత్వాన్ని, తన తండ్రి వారసత్వాన్ని అవమానించేలా ఉన్నాయని ఆమె మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం సోషల్ మీడియాలో ..మిగతా 2లో



# మమతా బెనర్జీకి భారీ షాక్

**విపక్ష నేత ఛాంబర్ తాళాలు రితవ్రతకు అందించిన స్పీకర్!**

**బెంగాల్ టీఎంసీలో తారాస్థాయికి చేరిన సంక్షోభం**

**ప్రతిపక్ష హోదా తమదేనన్న రెబల్ వర్గం**

**60 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని ప్రకటన**

**రితవ్రత బెనర్జీని ప్రతిపక్ష నేతగా స్పీకర్ గుర్తించారని వెల్లడి**

**న్యూఢిల్లీ, జూన్ 3 (ప్రభాత ఉదయం)**

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో సంచలనం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో అంతర్గత సంక్షోభం తారాస్థాయికి చేరింది. పార్టీ నుంచి బహిష్కరణకు గురైన నేత రితవ్రత బెనర్జీ, తమ వర్గాన్నే ప్రధాన ప్రతిపక్షంగా స్పీకర్ గుర్తించారని, తనకు ప్రతిపక్ష నేత (ఎల్ఓపీ) హోదా కల్పించారని ప్రకటించారు. గత నెల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత టీఎంసీకి ఇది మరో గట్టి ఎదురుదెబ్బగా మారింది. బుధవారం సుమారు 58 నుంచి 60 మంది టీఎంసీ ఎమ్మెల్యేల మద్దతు లేఖలతో రితవ్రత అసెంబ్లీకి చేరుకున్నారు. తమ వర్గానికి ప్రతిపక్ష హోదా కట్టబెట్టాలని కోరుతూ స్పీకర్ ..మిగతా 2లో





## రాజ్యసభ సీటును కాంగ్రెస్‌కు
# కేటాయించిన సీఎం విజయ్

**తమిళనాడులో ఖాళీగా ఉన్న రాజ్యసభ సీటును కాంగ్రెస్‌కు కేటాయించిన టీవీకే**

**కూటమి బంధాన్ని బలోపేతం చేసే దిశగా సీఎం విజయ్ నిర్ణయం**

**అన్నాడీఎంకే నేత షణ్ముగం రాజీనామాతో ఖాళీ అయిన స్థానం**

**కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రవీణ్ చక్రవర్తి పేరు ప్రముఖంగా ప్రచారం**

**జూన్ 18న రాజ్యసభ స్థానానికి ఉప ఎన్నిక**

**తమిళనాడు, జూన్ 3 (ప్రభాత ఉదయం)**

తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ, తమ కూటమి భాగస్వామి అయిన కాంగ్రెస్‌కు రాజ్యసభ స్థానాన్ని కేటాయించింది. జూన్ 18న జరగనున్న ..మిగతా 2లో

## కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా

# డీకే శివకుమార్ బాధ్యతల స్వీకరణ

**మొదటి పేజీ తరువాయి...**

బెంగళూరు అభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవంతో డీకే శివకుమార్ 'బ్రాండ్ బెంగళూరు' నినాదంతో ముందుకు వెళ్తున్నారు. నగరంలో దీర్ఘకాలంగా ఉన్న మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించడమే తన ప్రథమ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన కొద్ది గంటల్లోనే ఆయన ప్రకటించిన ప్రధాన హామీలు, పథకాలు ఈ విధంగా ఉన్నాయి:ఉచిత బస్ పాసులు: రాష్ట్రంలోని విద్యార్థులందరికీ ఉచిత బస్ పాసులు అందిస్తామని హామీ ఇచ్చారు.ప్రభుత్వ ఉద్యోగాలు: జాబ్ కాలెండర్ విడుదల చేస్తామని చెప్పారు. సుమారు 50,000 ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, దీనిపై తదుపరి కేబినెట్ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు.ప్రైవేట్ ఉపాధి: కర్ణాటక యువతకు ప్రాధాన్యతనిస్తూ నైపుణ్య శిక్షణతో కూడిన ప్రైవేట్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు.యువక సంఘాలు: క్రీడలు, సంస్కృతి, నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా



10,000 'భారత్ జోడో యువక సంఘాల'ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రతి సంఘానికి రూ. 10 లక్షల ఆర్థిక సహాయం అందిస్తారు.రోడ్ల అభివృద్ధి: గుంతలు, ట్రాఫిక్‌తో సతమతమవుతున్న బెంగళూరులో రోడ్ల మరమ్మతులు, అభివృద్ధి కోసం రూ. 2,000 కోట్లు కేటాయించారు.నిర్మాణాల క్రమబద్ధీకరణ: నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించాలని నిర్ణయించారు. 2,500 చదరపు అడుగుల లోపు ఉన్న ఆస్తులకు వన్-టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకాన్ని ప్రవేశపెట్టనున్నారు.బెంగళూరులో సరైన ప్రణాళిక లేకుండా ఇళ్లు నిర్మించారని, ఈ సమస్యను పరిష్కరించేందుకే ఈ నిర్ణయాలు తీసుకున్నామని శివకుమార్ వివరించారు. మరో రెండేళ్లలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, ఈ హామీలు కొత్త ప్రభుత్వానికి ప్రాధాన్యతలుగా మారనున్నాయి.



## సీఎం రేవంత్‌తో దక్షిణాఫ్రికా

# డిప్యూటీ ప్రెసిడెంట్ భేటీ

**మొదటి పేజీ తరువాయి...**

సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనరసింహ కూడా పాల్గొన్నారు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య చారిత్రక బంధం ఉందని డిప్యూటీ ప్రెసిడెంట్ మషాటిలే గుర్తుచేశారు. ఆఫ్రికన్ కాంటినెంటల్ ఫ్రీ ట్రేడ్ ఏరియా ద్వారా తెలంగాణ కంపెనీలకు విస్తృత మార్కెట్ అవకాశాలు లభిస్తాయని, ముఖ్యంగా ఫార్మా రంగంలో స్థానికంగా ఉత్పత్తి భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తామని ఆయన తెలిపారు.

## తెలంగాణ రాజకీయాలపై

# ఏపీలో పవన్ కీలక వ్యాఖ్యలు

**మొదటి పేజీ తరువాయి...**

అన్నారు. అంతకుముందు, అమరావతిలోని 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని సందర్శించి పవన్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహనీయులను కులాలకు పరిమితం చేసే ధోరణిని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కుల రాజకీయాలు విపరీతంగా పెరిగాయని, వాటిని ఎదుర్కొనేందుకే "సేనా గళం" కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. తెలంగాణలో జనసేన పార్టీ తరఫున అక్కడి స్థానికులే పోటీ చేస్తారని, ఆంధ్రప్రదేశ్ నేతలు ఎవరూ అక్కడికి వెళ్లి పోటీ చేయబోరని స్పష్టత ఇచ్చారు. "తెలంగాణ బిడ్డలు పోటీ చేస్తే అభ్యంతరం ఎందుకు?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. గద్దర్ కుటుంబం పట్ల, కేటీఆర్ పట్ల తనకు గౌరవం ఉందని, అయితే దేశ సమగ్రతకు భంగం కలిగించే చర్యలను వ్యతిరేకిస్తానని అన్నారు. కేటీఆర్ తనకు సోదరుడితో సమానమని అన్నారు.

# అవును, తెలంగాణ మా జాగీరే

**మొదటి పేజీ తరువాయి...**

ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు.

"పవనన్న, మిమ్మల్ని ఒక నటుడిగా, గద్దరన్న అభిమానిగా తెలంగాణ ప్రజలు గౌరవిస్తారు. కానీ, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు మీరు మాట్లాడిన మాటలను ఒక తెలంగాణ ఆడబిడ్డగా నేను ఖండిస్తున్నాను" అని వెన్నెల స్పష్టం చేశారు. "తెలంగాణ మీ జాగీరా అని అడిగారు. అవును, తెలంగాణ గడ్డ నిన్న మా అయ్యల జాగీరే. ఈరోజు మా జాగీరు. రేపు మా బిడ్డల జాగీరు. ఇది ముమ్మాటికీ మా జాగీరే" అంటూ ఆమె ఘాటుగా బదులిచ్చారు.

పైసలు పంచితే, లాబీలు చేస్తే తెలంగాణ రాలేదని, పోరాటాలతో వచ్చిందని అన్నారు. ఎవరినీ బాధపెట్టకుండా, హింసించకుండా, తమకు తాము ప్రాణాలు అర్పించుకుని తెలంగాణ సాధించుకున్నామని అన్నారు. ఇందుకు శ్రీకాంతచారి ఉదాహరణ అని చెప్పారు. పల్లెపల్లెలో త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్నామని అన్నారు. తెలంగాణ కోసం ఎంతోమంది ప్రాణాలు అర్పించారని అన్నారు.

తెలంగాణలో జనసేన పార్టీని విస్తరించి, జీహెచ్ఎంసీ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తామని జూన్ 2న హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ ప్రకటించారు.

ప్రాంతీయవాదం ఉగ్రవాదం కన్నా ప్రమాదకరమని, తెలంగాణ ఎవరి జాగీరు కాదని అన్నారు. గద్దర్‌కు తాను వాహనం కొనిచ్చి సహాయం చేశానని గుర్తుచేసుకుంటూ, ఏపీలో ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తానని కూడా తెలిపారు.



# ఢిల్లీ అగ్ని ప్రమాదం.. 21 మంది దుర్మరణం

## మరో 20 మందికి తీవ్ర గాయాలు ... లెమన్ గ్రీన్ రెస్టారెంట్ ప్రమాద ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి

**న్యూఢిల్లీ, జూన్ 3 (ప్రభాత ఉదయం)**

ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. దక్షిణ ఢిల్లీలోని మాలవీయనగర్‌లోని మికాసా-ఇన్ హోటల్‌లో జరిగిన ప్రమాదంలో 21మంది సజీవ దహనమయ్యారు. అనేకమంది గాయపడ్డారు. సెల్లార్‌లో ఉన్న ముగ్గురిని కాపాడినట్లు పోలీసులు ప్రకటించారు. అగ్నిప్రమాదం జరిగినప్పుడు మికాసా-ఇన్ హోటల్‌లో విదేశీయులుసహా 40మంది వరకు ఉన్నట్లు తెలుస్తోంది.

**అసలేం జరిగింది?**

పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, బుధవారం ఉదయం 8.50గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శకటాలు, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. అయితే, ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. హోటల్‌లో సుమారు 25గదులు ఉండగా, దాదాపు 40మంది అతిథులు బస చేసినట్లు సమాచారం. వారిలో ఎక్కువమంది వైద్య చికిత్స కోసం వచ్చిన విదేశీయులే అని తెలుస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో హోటల్‌లోని అతిథులు నిద్రలో ఉన్నట్లు సమాచారం. ఉదయం 8.00 గంటల ప్రాంతంలో ఎలక్ట్రిక్ స్టవ్‌ను ఆన్ చేయడానికి ప్రయత్నించినప్పుడు అకస్మాత్తుగా మంటలు ఎగసిపడ్డాయని హోటల్ చెఫ్ తెలిపారు. అప్పటికే హోటల్ మొత్తం మంటలు వ్యాపించాయని చెప్పారు. అయితే, బాధితులు కొందరు ప్రాణాలు కాపాడుకునేందుకు హోటల్ భవనం నుంచి కిందకు దూకినట్లు స్థానికులు తెలిపారు. ఢిల్లీ ప్రభుత్వ బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ (బీఅండ్‌బీ) పథకం కింద ఫ్లోరిశ్ స్టే అనే హోటల్‌కు కేవలం ఆరు గదులను మాత్రమే నిర్వహించడానికి లైసెన్స్ ఉందని, అయితే అగ్నిప్రమాదం జరిగిన సమయంలో అది ఏకంగా 25 గదులతో పనిచేస్తోందని ఓ వార్తా సంస్థ పేర్కొంది.

**స్పందించిన మోదీ**

మరోవైపు, ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. "అగ్నిప్రమాదంలో చాలా మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరం. తమ ఆత్మీయులను కోల్పోయిన వారికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా. ప్రమాద బాధితులకు అధికారులు సాధ్యమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తున్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాం. అలాగే, గాయపడిన వారికి రూ.50,000 ప్రకటించాం" అని మోదీ పేర్కొన్నారు.

**ప్రమాద ఘటనపై ఢిల్లీ సర్కార్ రెస్పాండ్**

ఇక, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కూడా ఈ ఘటనపై స్పందించారు. "మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని, ఈ కష్టసమయంలో బాధిత కుటుంబాలకు మనోధైర్యం కలగాలని ప్రార్థిస్తున్నా. ఈ ఘటన గురించి సమాచారం అందిన వెంటనే ఢిల్లీ ఫైర్ సర్వీసెస్, ఢిల్లీ పోలీస్, డీడీఎంఏ, క్యాట్స్ అంబులెన్స్ సర్వీసెస్, ఇతర అత్యవసర సహాయక సంస్థల బృందాలను రంగంలోకి దించి, సహాయక చర్యలు చేపట్టాం. రక్షణ బృందాలు పలువురిని రక్షించి, సురక్షిత ప్రాంతాలకు తరలించారు" అని సీఎం రేఖా గుప్తా అన్నారు.

## తెలంగాణలో పెరగనున్న

# భూముల విలువలు

**మొదటి పేజీ తరువాయి...**

అపార్ట్‌మెంట్లలోని అన్ని అంతస్తులకు ఒకే రకమైన విలువను వర్తింపజేయనున్నారు. ఇప్పటికే అధిక విలువలు ఉన్నచోట్ల ఎలాంటి పెంపు ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ సహా కీలక ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, నివాస ప్లాట్లు, ఫ్లాట్లకు కొత్త కనీస ధరలను నిర్ణయించారు. ఈ సవరణ ఫలితంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయి. ఇది ఆస్తి కొనుగోలుదారులపై, పెట్టుబడిదారులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే, ప్రజలపై అనవసర భారం పడకుండా హేతుబద్ధంగానే ఈ మార్పులు చేశామని, దీనివల్ల ప్రభుత్వ ఆదాయం పెరగడంతో పాటు లావాదేవీలలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## రాజ్యసభ సీటును కాంగ్రెస్‌కు

# కేటాయించిన సీఎం విజయ్

**మొదటి పేజీ తరువాయి...**

ఉప ఎన్నికకు సంబంధించి ఖాళీగా ఉన్న ఏకైక రాజ్యసభ సీటును కాంగ్రెస్‌కు ఇస్తున్నట్లు టీవీకే అధినేత, ముఖ్యమంత్రి విజయ్ బుధవారం ప్రకటించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన అన్నాడీఎంకే నేత సి.వి. షణ్ముగం తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఈ స్థానం ఖాళీ అయింది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా నిలిచినా, సాధారణ మెజారిటీకి కొద్ది దూరంలో ఆగిపోయింది. దీంతో కాంగ్రెస్, వీసీకే వంటి మిత్రపక్షాల మద్దతుతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. డీఎంకేతో పొత్తును వీడి టీవీకేకు మద్దతు పలికిన కాంగ్రెస్‌తో బంధాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకే విజయ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పార్టీ డేటా అనలిటిక్స్ విభాగానికి ఛైర్మన్‌గా ఉన్న ప్రవీణ్ చక్రవర్తి పేరు బలంగా వినిపిస్తోంది. ఆయన రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడు. మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం సీఎం విజయ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ కావడం కూడా ఈ ఊహాగానాలకు బలం చేకూర్చింది. టీవీకే, దాని మిత్రపక్షాల ఎమ్మెల్యేల మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు లాంఛనప్రాయమే కానుంది. అభ్యర్థి ఎవరనే దానిపై కాంగ్రెస్ అధిష్ఠానం త్వరలోనే తుది నిర్ణయం తీసుకోనుంది. ఈ కేటాయింపుతో ప్రభుత్వ స్థిరత్వాన్ని కాపాడుకుంటూనే, కాంగ్రెస్‌కు పార్లమెంటు ఎగువ సభలో ప్రాతినిధ్యం కల్పించినట్లవుతుంది.


# మమతా బెనర్జీకి భారీ షాక్

**మొదటి పేజీ తరువాయి...**

రతీంద్రనాథ్ బోస్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, తమదే అసలైన, ప్రధాన ప్రతిపక్షమని రితవ్రత స్పష్టం చేశారు. స్పీకర్ తమ ప్రతిపాదనను అంగీకరించి, ప్రతిపక్ష నేత కార్యాలయాన్ని తనకు కేటాయించారని, విపక్షనేత ఛాంబర్ తాళాలు తనకు అప్పగించారని ఆయన తెలిపారు. గత నెలలో జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించడం, సువేందు అధికారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం తెలిసిందే. ఎన్నికల ఫలితాల అనంతరం టీఎంసీలో అసమ్మతి పెరిగింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో జూన్ 1న రితవ్రతతో పాటు మరో ఎమ్మెల్యేను పార్టీ నుంచి బహిష్కరించారు.పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం నుంచి రక్షణ పొందేందుకు అవసరమైన మూడింట రెండొంతుల కంటే ఎక్కువ మంది ఎమ్మెల్యేల మద్దతు తమకు ఉందని టీఎంసీ రెబల్ వర్గం చెబుతోంది. అయితేచ తాము మమతా బెనర్జీకి విధేయులమేనని, ఇది పార్టీలో చీలిక కాదని, 'అసలైన టీఎంసీ'ని తామేనని వారు పేర్కొంటున్నారు. ఈ కీలక పరిణామంపై స్పీకర్ కార్యాలయం నుంచి గానీ, టీఎంసీ

# ఆదాయనిమించి ఆస్తుల కేసులో అదనపు ఎస్పీ భుజంగరావు అరెస్ట్!

## 16 చోట్ల ఏసీబీ మెరుపు సోదాలు.. కోట్ల విలువైన అక్రమాస్తులు బట్టబయలు



ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టరని ఆరోపణలు ఎదుర్కొంటున్న భజంగ్ రావు..




వివరాలను విలేకరులకు వివరిస్తున్న డీఎస్పీ శ్రీధర్..



భుజంగ్ రావు ఇంట్లో స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు.

**శేరిలింగంపల్లి జూన్ 3, (ప్రభాత ఉదయం)**

ఆదాయానికి మించిన అక్రమాస్తులు కూడబెట్టారనే అభియోగాలపై సస్పెన్షన్‌లో ఉన్న అదనపు ఎస్పీ (ఏఎస్పీ) నాయిని భుజంగరావును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం అరెస్ట్ చేశారు. జూన్ 3న ఉదయం 9 గంటల నుంచే ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో అధికారులు ఏకకాలంలో మొత్తం 16 ప్రాంతాల్లో మెరుపు సోదాలు నిర్వహించారు. ప్రాథమిక విచారణలోనే భుజంగరావు ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు నిర్ధారణ అయిందని అధికారులు ప్రకటించారు. ఈ దాడుల్లో కోట్ల రూపాయల విలువైన భూములు, ఇళ్లు, నగదు, బంగారం పట్టుబడటం సంచలనం సృష్టించింది. భారీగా భూములు, ప్లాట్లు భుజంగరావు మామ పేరుతో సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో ఉన్న 27.29 ఎకరాల వ్యవసాయ భూమిని అధికారులు గుర్తించారు. వీటితో పాటు 5 ఓపెన్ ప్లాట్లు, 2 ఇళ్లు, హైదరాబాద్‌లోని ఒక కమర్షియల్ భవనానికి సంబంధించిన కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. రూ.3.83 లక్షల నగదు రూ.8 లక్షల బ్యాంకు డిపాజిట్లు, దాదాపు 1 కిలో బంగారు ఆభరణాలను ఏసీబీ సీజ్ చేసింది. వీటితో పాటు ఒక మారుతి స్విఫ్ట్, ఒక కియా సెల్టోస్ కార్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల విలువ రూ.5.92 కోట్లకు పైగా ఉంటుందని, అయితే బహిరంగ మార్కెట్లో దీని విలువ మరెన్నో రెట్లు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏసీబీ అధికారులు అంచనా వేస్తున్నారు.

**ఇంట్లో మద్యం బాటిళ్లు.. ఎక్సైజ్ ఎంట్రీ!**

సోదాల సమయంలో భుజంగరావు నివాసంలో అనుమతికి మించి 29 విదేశీ, దేశీయ మద్యం సీసాలు లభ్యమవడం కలకలం రేపింది. దీనిపై ఏసీబీ అధికారులు వెంటనే ఎక్సైజ్ శాఖకు సమాచారం అందించారు. అక్రమాస్తుల కేసుతో పాటు దీనిపై ఎక్సైజ్ చట్టం కింద విడిగా కేసు నమోదు కానుంది. బినామీలపై నజర్

అక్రమాస్తుల కేసులో అరెస్ట్ చేసిన నాయిని భుజంగరావును నాంపల్లిలోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, భుజంగరావు వెనుక ఉన్న బినామీల గుట్టు కూడా రట్టు చేస్తామని వారిపై కూడా కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఈ అక్రమ సామ్రాజ్యం వెనుక ఇంకా ఎవరెవరి హస్తం ఉందనే కోణంలో ఏసీబీ లోతుగా విచారిస్తోందని డీఎస్పీ తెలిపారు.

# జూన్ 12వ తేదీన వ్యవసాయ వర్శిటీ ఆవిర్భావ దినోత్సవం


### రాహుల్ గాంధీ ని ముఖ్య అతిధిగా ఆహ్వానించిన విశ్వవిద్యాలయం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో ఉత్సవాలు

**బుద్వేల్, జూన్ 3 (ప్రభాత ఉదయం)**




రాజేంద్రనగర్ లో గల ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం జూన్ 12న 62వ ఆవిర్భావ దినోత్సవాలను నిర్వహించనుంది. మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరాగాంధీ చేతుల మీదుగా 1964 జూన్ 12వ తేదీన రాజేంద్రనగర్ లో ఆం ధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పడింది. ఏర్పాటైన ఈ విశ్వవిద్యాలయం అభివృద్ధి కి ఇందిరాగాంధీ ఎంతగానో తోడ్పాటునందించారని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. అం దులో బాగంగానే ఈ నెల 12న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించనున్న వర్శిటీ 62వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహోల్ గాంధీ ని ఆహ్వానించడం జరిగిందన్నారు. హరిత విప్లవ సాధన లో ఇందిరా గాంధీ విశేష సేవలు అన్న అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి ఆవిర్భావ దినోత్సవ ప్రసంగం చేయనున్నారన్నారు. ప్రముఖ వ్యవసాయ ఆర్థిక వేత్త ఎంఎస్ స్వామినాథన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు ప్రొఫెసర్ మధురా స్వామినాథన్ ఈ జాతీయ సదస్సులో కీలకోపన్యాసం చేస్తారన్నారు. ప్రముఖ పార్లమెంటేరియన్, విశ్లేషకులు ఉ ండవల్లి అరుణ్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని విశిష్ట ప్రసంగం చేస్తారన్నారు.



**రాహుల్ గాంధీ కి ఆహ్వానం**

వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం, ఇతర మౌళిక వసతులను ఆనాటి ప్రధాన మంత్రి ఇం దిరాగాంధీ ప్రారంభించి 60 ఏళ్లు అయిన సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు ముఖ్య అతిధిగా రావాల్సిందిగా లోక్ సభ లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కి ఆహ్వానం అందించినట్లు వర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించవలసిందిగా విశ్వవిద్యాలయం కోరిందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో ఈ ఉ త్సవాలను నిర్వహిస్తున్నట్లు అల్దాస్ జానయ్య తెలిపారు. 1966-84 ల మధ్య లో హరిత విప్లవాన్ని విజయవంతంగా అమలు చేసి దేశానికి అహార భద్రతను అందించిన ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ నాయకత్వాన్ని, ఆ నాటి రైతు అనుకూల విధానాలను వివిధ సంస్థలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని ఉపకులపతి జానయ్య పేర్కొన్నారు. అందుకే ఈ 62వ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ సదస్సు ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య


మార్కండేయ నగర్ లోని నరసబాయి కుంట ను పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు

# నర్సభాయి కుంటను సుందరంగా తీర్చిదిద్దాలి

### ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

**బుద్వేల్, జూన్ 3 (ప్రభాత ఉదయం)**

మార్కండేయనగర్, బాబుల్రెడ్డినగర్ ను ఆనుకుని ఉన్న నర్సభాయి కుంట ను అభివృద్ధి చేయడానికి అంచనాలు తయారు చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ అధికారులకు సూచించారు. బుధవారం రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తో కలసి ఆయన నర్సభాయి కుంట ను సందర్శించారు. అటు సాయిబాబానగర్, ఇటు మార్కం డేయనగర్, బాబుల్ రెడ్డినగర్, వెంకటేశ్వర కాలనీ ల మధ్య ఉన్నటువంటి నర్సబాయి కుంటను సుం దరంగా తీర్చిదిద్దాలని సూచించారు. కుంట అభివృద్ధి తో పాటు వాకింగ్ ట్రాక్, చిన్న పిల్లలు ఆడుకోవడానికి రిక్రియేషన్ జోన్, ఓపెన్ జిమ్ లాంటి సౌకర్యాలను చేపట్టాలన్నారు. రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రాజేంద్రనగర్ జోన్ పరిధిలో ఉన్న పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో బాగంగానే నర్సభాయి కుంట ను పరిశీలిం చడం జరిగిందన్నారు. త్వరలోనే అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నర్సభాయి కుంటను అందంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే పర్యటన లో అధికారులు నరేందర్ గౌడ్, స్థానిక నాయకులు సోమ శ్రీనివాస్ గుప్తా. ఎన్ ధనుంజయ, టి ప్రేంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.




కాటేదాన్ టీ ఎన్ జీ ఓ స్ హౌసింగ్ సొసైటీ నూతన పాలక మండలి సభ్యులు

# టీఎన్జీవోస్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షులుగా ఎం క్రిష్ణారెడ్డి

**బుద్వేల్, జూన్ 3 (ప్రభాత ఉదయం)**

కాటేదాన్ టీఎన్జీవోస్ కోపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షులుగా ఎం క్రిష్ణారెడ్డి నియమితులైనారు. బుధవారం సొసైటీ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా ఇంచార్జి కో ఆపరేటివ్ ఆఫీసర్ బి నాగేశ్వర్ రావు సమక్షంలో చేతులెత్తి ఎన్నుకునే విధానం లో ఈ ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షులుగా ఎస్ మోహన్రావు, కార్యదర్శిగా ఆర్ పెంటయ్య, మేనేజింగ్ కమిటీ మెంబర్లుగా ఎన్ భూమయ్య, జి చంద్రయ్య లు ఎన్నికైనారు. మరో రెండు మేనేజింగ్ కమిటీ సభ్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎలక్షన్ ఆఫీసర్గా వ్యవహరించిన బి నాగేశ్వర్ రావు మాట్లాడుతు 7 పోస్టులకు గాను జరిగిన ఎన్నికలలో ఆరుగురు వచ్చారని, ఐదు పోస్టులకు వారు ఎంపికయ్యారన్నారు. సహకార శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ఎన్నికలు నిర్వహించడం జరిగిందన్నారు. చేతులెత్తి ఎన్నుకునే ప్రక్రియ లో నలుగురు వచ్చిన ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా టీఎన్జీవోస్ హౌస్ సొసైటీ ఎన్నికలు: మెట్రో వాటర్ వర్క్స్ టీఎన్జీవోస్

### అధ్యక్షులు సాయినాథ్ గౌడ్

**బుద్వేల్, జూన్ 3 (ప్రభాత ఉదయం)**



మైలార్దేవుపల్లి కాటేదాన్ టీఎన్జవోస్ హౌసింగ్ సొసైటీకి బుధవారం నిర్వహించిన ఎన్నికలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని మెట్రో వాటర్ వర్క్స్ టీఎన్జవోస్ అధ్యక్షులు సాయినాథ్ గౌడ్ ఓ ప్రకటన లో ఆరోపించారు. కొందరు అధికారులు డబ్బులకు అమ్ముడుపోయి అక్రమార్కులకు అండగా నిబంధనలు పాటించకుండ ఎన్నికలు నిర్వహించారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ తో కోర్టుకెళితే కొట్టేస్తారనే కారణంతో కోర్టు సెలవు ఉన్న సమయంలో నోటిఫికేషన్ ఇచ్చి వెంటనే ఎన్నికలు నిర్వహించారన్నారు. గతంలో అనేక అక్రమాలకు పాల్పడ్డ వ్యక్తులే మళ్లీ సొసైటీ లో అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిగా నియమితులైనారన్నారు. ప్రస్తుతం ఎన్నికైన ప్రధాన కార్యదర్శి గతంలో 50 ప్లాట్లను అక్రమంగా తన కుటుంబ సభ్యులపై రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని ఆరోపించారు. ఈ విషయం పై ప్రభుత్వ అధికారులే ప్రభుత్వానికి నివేధికలు పంపించారన్నారు. వారి తప్పులు కప్పి పుచ్చుకోవడానికి తిరిగి ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీ ని ఏర్పాటు చేశారన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు నామినేషన్ వేసే అభ్యర్థికి ఒక ప్రపోజర్, మరొక సెకండర్ ఉండాలని గుర్తు చేశారు. ఐదు మంది ని కమిటీ సభ్యులుగా నియమించారని, అంటే అక్కడ పది మందైన ఉండాలన్నారు. కానీ వచ్చిన ఐదు మ ంది తోనే కమిటీని ఏర్పాటు చేయడం బాధాకరమన్నారు. ఇది ఎన్నికల నిర్వాహణకు పూర్తి వ్యతిరేకమన్నారు. డబ్బులకు అమ్ముడుపోయిన అధికారులు నిబంధనలను పట్టించుకోకుండానే ఎన్నికలు ఎన్నికలు నిర్వహించారన్నారు. ఎన్నికలు నిర్వహించిన తీరు పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు ట్రిబ్యునల్ లో చాలెంజ్ చేసి జరిగిన ఎన్నికను రద్దు చేయిస్తామన్నారు.


రాజేంద్రనగర్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

# బుద్వేల్ లో పెండింగ్ పనులను పూర్తి చేయాలి: ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

**బుద్వేల్, జూన్ 3 (ప్రభాత ఉదయం):**

బుద్వేల్ బస్తీ లోని పెట్రోల్ బంకు నుంచి శ్రీ శివాంజనేయ స్వామీ దేవాలయం మీదుగా సాయిక్రిష్ణ కాలనీ, కిష్టమ్మ గుట్ట వరకు మంజూరైన సీసీ రోడ్డు ను వెంటనే వేసేటట్లు చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ రాజేంద్రనగర్ సర్కిల్ ఇంజనీరిం గ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం బుద్వేల్ కు చెందిన శ్రీ శ్రీనివాస సేవా సమితి అధ్యక్షులు పెండ్యాల సాయిమల్లిక్, కాంగ్రెస్ నాయకులు రగడంపల్లి శ్రావణ్ లు మైలార్దేవుపల్లిలోని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ నివాసం లో కలసి ఆయనకు పెండింగ్ లో ఉన్న పనుల గురించి ఫిర్యాదు చేశారు. స్పందిచిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ రాజేంద్రనగర్ సర్కిల్ ఇంజనీరింగ్ అధికారుతో ఫోన్ చేసి మాట్లాడారు. సీసీ రోడ్డు ఏర్పాటు కు రూ. ఒక కోటి ముప్పై లక్షల వరకు మంజూరు అయ్యాయని, వాటితో నాణ్యంగా రోడ్డు వేసేటట్లు చూడాలన్నారు. కాంట్రాక్టర్ నాసి రకం రోడ్డు వేస్తే బిల్లులు ఇవ్వవద్దన్నారు. ప్రధాన రహదారి అయినందున అధికారులు దగ్గరుండి రోడ్డు పనులను పర్యవేక్షించాలన్నారు. బుద్వేల్ రజక స్మశానవాటిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. బుద్వేల్ లో పెండింగ్ లో ఉన్న అన్ని పనులను పూర్తి చేయాలని కోరారు



**సనత్ నగర్ ఇన్స్ పెక్టర్ గా పనిచేసిన సమయంలో ప్రస్తుత రాజేంద్రనగర్ ఇన్స్ పెక్టర్ ఎం ముత్తు యాదవ్ ఓ కేసు చేధన లో అద్భుత ప్రతిభ కనబరిచి దోషులకు శిక్ష పడేటట్లు చేయడంతో ఆయనకు బెస్ట్ ఇన్వేస్టిగేషన్ ఆఫీసర్ గా ప్రశంస పత్రం లభించింది. ఆ ప్రశంసా పత్రాన్ని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఎం ముత్తు యాదవ్ కు అం దజేశారు.**

**- బుద్వేల్, ప్రభాత ఉదయం**



సమావేశంలో మాట్లాడుతున్న మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఫైమిదా

# రాజేంద్రనగర్ మండల మహిళా సమాఖ్య యదావిధిగా కొనసాగుతుంది

**బుద్వేల్, జూన్ 3 (ప్రభాత ఉదయం)**

ఎలాంటి నిబంధనలు లేకుండ 33శాతం మహిళా రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రం గారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఫైమిదా అన్నారు. బుధవారం సాయంత్రం బుద్వేల్ లోని సీపీఐ కార్యాలయంలో రాజేంద్రనగర్ మండల మహిళ సమాఖ్య కార్యదర్శి కన్యగారి లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. రాజేంద్రనగర్ మండల మహిళా సమాఖ్య కమిటీ యదావిధిగా కొనసాగుతుందని ఆమె తెలిపారు. అధ్యక్షురాలుగా కె మునేశ్వరీ, ప్రధాన కార్యదర్శిగా కన్యగారి లక్ష్మీ, సహయ కార్యదర్శిగా కె వాణి, ఎం సుగుణ, మౌనిక, ఉపాధ్యక్షులుగా సయ్యద్ రేష్మ, శాం తమ్మ, జ్యోతి, కార్యవర్గ సభ్యులుగా వి సునీత, వి సుమలత, కాన్దారి భారతమ్మ, ఎం స్వరూప, పద్మాగౌడ్, కె శారద, జి రాములమ్మ, ఉర్మిళ, సుజాత, వనమ్మ లు ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ కార్యదర్శి జి సత్యం, సహయ కార్యదర్శి దర్శనాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపోలో సిబ్బందికి మజ్జిగ పంపిణీ

**బుద్వేల్, జూన్ 3 (ప్రభాత ఉదయం)**

వేసవి లో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఆరోగ్యంగా ఉండాలని ప్రతి రోజు డిపో లో మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజరు బి క్రిష్ణారెడ్డి తెలిపారు. బుధవారం డిపో ఆవరణలో ఆయన సిబ్బందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఏప్రిల్, మే, జూన్ మాసాలలో రోజుకు 10 కిలోల పెరుగు తో తయారు చేసిన మజ్జిగ ను సిబ్బందికి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలను అందిస్తున్న ఆర్టీసీ నిబ్బంది ఆరోగ్యంగా ఉం డాలనే ఆలోచన తో ఎండ వేడిమికి ఇబ్బందులు కలుగకుండ ఉండటానికి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.




ఆర్టీసీ సిబ్బందికి మజ్జిగ పంపిణీ చేస్తున్న రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ బి కృష్ణా రెడ్డి

# నాణ్యమైన పోలీసు శిక్షణ కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలి: డిజిపి సివి ఆనంద్

## రాష్ట్ర పోలీసు అకాడమీని సందర్శించిన తెలంగాణ డీజీపీ సివి ఆనంద్







**రాజేంద్రనగర్,జూన్03(ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర పోలీసుశాఖ అధిపతిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సివి ఆనంద్ బుధవారం హైదరాబాద్‌లోని రాజా బహదూర్ వెంకట రామారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీని సందర్శించారు.అకాడమీకి చేరుకున్న డీజీపీకి అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్ స్వాగతం పలికారు.అనంతరం డీజీపీకి అకాడమీలో వందనం సమర్పించారు.ఈ సందర్భంగా డీజీపీ అకాడమీలోని యూనిట్ హాస్పిటల్,పరిపాలనా విభాగం,ఆడిటోరియం,తరగతి గదులు,మెస్‌లు,క్రీడా భవన్,ఫైరింగ్ రేంజ్,పరేడ్ గ్రౌండ్లు తదితర శిక్షణ,మౌలిక సదుపాయాలను పరిశీలించారు.అనంతరం అకాడమీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి,అధికారులు,సిబ్బందితో పరస్పర చర్చలు జరిపారు.ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్ట్ అకాడమీలో నిర్వహిస్తున్న ప్రాథమిక,సేవాకాల శిక్షణా కార్యక్రమాలు,శిక్షణా ప్రణాళికలు,సంస్థాగత బాధ్యతలు,మౌలిక వసతులు,నిర్వహించిన వర్క్‌షాప్‌లు, సెమినార్లు,సంక్షేమ కార్యక్రమాలు,అకాడమీ ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లపై సమగ్ర ప్రజెంటేషన్ అందించారు.సమీక్ష అనంతరం డీజీపీ సివి ఆనంద్ మాట్లాడుతూ...అకాడమీలో శిక్షణ అందిస్తున్న అధికారులను అభినందించారు.దేశంలోని అత్యుత్తమ పోలీసు శిక్షణా సంస్థల్లో తెలంగాణ పోలీస్ అకాడమీ ఒకటిగా నిలిచిందని ప్రశంసించారు.నాణ్యమైన పోలీసు శిక్షణ కోసం అధికారులు,సిబ్బంది సమన్వయంతో జట్టుగా పనిచేయాలని సూచించారు.తాను గతంలో జాతీయ పారిశ్రామిక భద్రతా అకాడమీలో పనిచేసిన అనుభవాన్ని ప్రస్తావిస్తూ,వృత్తిపరమైన పోలీసింగ్‌లో శిక్షణ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.రాష్ట్రంలోని పోలీస్ ట్రైనింగ్ కాలేజీలు,జిల్లా శిక్షణా కేంద్రాలు సహా అన్ని శిక్షణా సంస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.శిక్షణా కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన అనుమతులు,మౌలిక వసతులు,ఇతర సంస్థాగత అవసరాల విషయంలో ప్రధాన కార్యాలయం నుంచి పూర్తి సహకారం అందజేస్తామని హామీ ఇచ్చారు.అన్ని హోదాల్లోని పోలీసు సిబ్బందికి తప్పనిసరి శిక్షణా కోర్సులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించి పూర్తి చేయాలని సూచించారు.అలాగే మాదకద్రవ్యాల నియంత్రణ,సైబర్ నేరాల దర్యాప్తు,మోటార్ వాహనాల చట్టం అమలు,రోడ్డు భద్రత,ప్రజల్లో అవగాహన కల్పన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అకాడమీ అధికారులను ఆదేశించారు.తెలంగాణ పోలీసు అధికారుల రిట్రీట్ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ మొదటి వారంలో క్రమం తప్పకుండా నిర్వహిస్తామని తెలిపారు.అదేవిధంగా పోలీసు శాఖలో మహిళా సిబ్బంది సంక్షేమం,సమాన అవకాశాలు,సంస్థాగత సంస్కరణలను బలోపేతం చేయడానికి "తెలంగాణ కాన్ఫరెన్స్ ఫర్ ఉమెన్ ఇన్ పోలీస్" కార్యక్రమాన్ని కూడా ప్రతి సంవత్సరం నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అకాడమీకి చెందిన సీనియర్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాఫిక్ అంతరాయం కలిగే ప్రదేశాలను పరిశీలిస్తున్న సైబరాబాద్ సీపీ రమేష్, సీఎంసీ కమీషనర్ సృజన ఇతర అధికారులు..

# వర్షాకాలం ముందే మేల్కొందాం

**ట్రాఫిక్, వరద సమస్యలపై సైబరాబాద్ సీపీ, జీహెచ్ఎంసీ కమిషనర్ యాక్షన్ ప్లాన్!**

**సమస్యాత్మక ప్రాంతాల్లో జాయింట్ ఇన్‌స్పెక్షన్**

**ఐటీ కారిడార్‌లో నీటి నిల్వల నివారణే లక్ష్యం**

**సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆదేశం**

**శేరిలింగంపల్లి : జూన్ 3, (ప్రభాత ఉదయం)**

వర్షాకాలం ముంచుకొస్తున్న నేపథ్యంలో నగరవాసులకు ముఖ్యంగా ఐటీ కారిడార్ ప్రయాణికులకు వరద నీరు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు ముమ్మరం చేశారు. రోడ్లపై ఎక్కడ నీరు నిలబడకుండా, వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూసేందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేష్, సీఎంసీ కమిషనర్ సృజనతో కలసి క్షేత్రస్థాయిలో సంయుక్తంగా పర్యటించారు. సైబరాబాద్ పరిధిలోని పలు సమస్యాత్మక ప్రాంతాలను సందర్శించి, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు.భారీ వర్షాలు కురిసినప్పుడు ఐటీ కారిడార్‌లో తీవ్ర ట్రాఫిక్ జామ్‌లకు కారణమవుతున్న ప్రాంతాలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. మల్కం చెరువు బయోడైవర్సిటీ జంక్షన్ సమీపంలోని కేర్ హాస్పిటల్ వద్ద రోడ్డుపై వరద నీరు భారీగా చేరుతున్న ప్రాంతాన్ని సీపీ, కమిషనర్ పరిశీలించారు. అనంతరం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రోడ్డు, కొండాపూర్‌లోని హర్ష టయోటా షోరూం జంక్షన్ తదితర ప్రాంతాల్లో నీరు నిలిచే చోట్లను గుర్తించారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా తక్షణమే ఇంజనీరింగ్ పనులు చేపట్టాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వ ఉండటం వల్ల ట్రాఫిక్ స్తంభించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా రవాణాకు ఎలాంటి ఆటంకం కలగకుండా మునిసిపల్, పోలీస్, ఇంజనీరింగ్ విభాగాలు ఒకరికొకరు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించుకున్నారు.సమస్యాత్మక ప్రాంతాలను ముందే గుర్తించి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా ఈసారి వర్షాకాలంలో ట్రాఫిక్ అంతరాయాలను పూర్తిగా నివారించవచ్చని అధికారులు ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఈ సంయుక్త క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావుతో పాటు జీహెచ్ఎంసీ, సైబరాబాద్ ట్రాఫిక్ విభాగానికి చెందిన పలువురు ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# పావురాన్ని కాపాడబోయి ప్రాణం పోగొట్టుకున్న ఉద్యోగి

**బుద్వేల్, జూన్ 3 (ప్రభాత ఉదయం)**



బాలాజీ

రాజేంద్రనగర్ లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ సంస్థ (ఎన్ఐఆర్డీపీఆర్) పరిపాలన భవనం రెండవ అంతస్థు లో చిక్కుకున్న ఓ పావురాన్ని కాపాడబోయి ప్రమాదవశాత్తు క్రింద పడ్డ ఓ ఉద్యోగి ఆసుపత్రి లో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మరణించాడు. హృదయ విధారకమైన ఈ సంఘటన వివరాలు ఈ విధంగా ఉన్నాయి... తమిళనాడు కు చెందిన బాలాజీ (54) కౌన్సిల్ ఫర్ అడ్వాన్స్మెంట్ ఆఫ్ పీపుల్స్ యాక్షన్ అండ్ రూరల్ టెక్నాలజీ (కపార్ట్) లో రీసెర్చ్ ఆఫీసర్ గా పనిచేసేవారు. రాజేంద్రనగర్ లోని ఎన్ఐఆర్డీపీఆర్ లో కొంత కాలం ఆ సంస్థ కొనసాగింది. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం ఆ సంస్థ ను రద్దు చేసింది. ఆ సంస్థ ఉద్యోగులను ఇతర శాఖలలో సర్దుబాటు చేసింది. ఆ సమయంలో బాలాజీ ఎన్ఐఆర్డీపీఆర్ లో అడ్మిన్ మేనేజరు గా చేరారు. అతని భార్య లక్ష్మీ బాలాజీ తమిళనాడు లో అగ్రికల్చర్ ఆపీసర్ గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు


**పావురాన్ని కాపాడబోయి ప్రాణం పోగొట్టుకున్నాడు :**

ఎన్ఐఆర్డీపీఆర్ లో అడ్మిన్ మేనేజరు గా పనిచేస్తున్న బాలాజీ ఇటీవల సెలవు పై తమిళనాడు లోని భార్య లక్ష్మి బాలాజీ వద్దకు వెళ్లారు. భార్య తో కలసి ఊటీ కి వెళ్లి సరదాగా గడిపాడు. ఈ నెల ఒకటవ తేదీన మధ్యాహ్నం హైదరాబాద్ వచ్చి డ్యూటీ లో చేరాడు. గత సోమవారం సాయంత్రం 5:30 గంటలకు బాలాజీ పనిచేస్తున్న చోట ఓ పావురం రెండవ అంతస్థులో ఇరుక్కుంది. దానిని కాపాడటానికి బాలాజీ కుర్చీ వేసుకుని కప్పు పైకి ఎక్కాడు. అక్కడ పావురాలు లోపలికి రాకుండ ఉండటానికి పెట్టిన రేకు షీట్ పై కాలు పెట్టడంతో క్రింద పడిపోయాడు. తీవ్ర గాయాలకు గురైన బాలాజీ ని చికిత్స నిమిత్తం హైదర్ గూడ లోని జాయ్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న బాలాజీ బుధవారం తెల్లవారుజామున 1:30 గంటలకు మరణించాడు. బాలాజీ భార్య లక్ష్మి బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

# గ్రామ, వార్డు సభలను సజావుగా నిర్వహించాలి

**ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్లకు అవగాహన కల్పించాలి: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 3(ప్రభాత ఉదయం)**



గ్రామ, వార్డు సభల్లో ప్రభుత్వం సూచించిన అంశాలన్నింటినీ ప్రస్తావిస్తూ సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.బుధవారం గద్వాల కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఈనెల 4, 6, 8,10వ తేదీల్లో జిల్లా వ్యాప్తంగా నిర్వహించు సభలపై కలెక్టర్ గూగుల్ మీట్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడారు. సభల నిర్వహణకు షెడ్యూల్ తయారు చేసి దాని ప్రకారం ముందుకెళ్లాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఎంఏఓలు నోడల్ అధికారులుగా ఆయా గ్రామ, వార్డు సభలను నిర్వహించాలన్నారు. జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలలో రెండు వార్డులకు కలిపి ఒకచోట సభను నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించాలని పేర్కొన్నారు. ఈ సభల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, వర్షపు నీరు హార్వెస్టింగ్, తదితర అంశాలపై అవగాహన కలిగించాలన్నారు. గ్రామ సభల్లోనూ రైతులకు ఆయిల్ ఫామ్, హార్టికల్చర్, ఫార్మర్ రిజిస్ట్రీ, నానో యూరియా, తదితర అంశాలపై పిపిటి ద్వారా తెలియజేయాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అక్టోబర్ 1వ తేదీన ఫైనల్ ఓటర్ జాబితా ప్రకటనతో ముగుస్తుందని పేర్కొన్నారు. పోలింగ్ స్టేషన్ల వారీగా విధులు నిర్వహించే బిఎల్వోలు ఓటర్ల ఇంటికి వచ్చినప్పుడు అవసరమైన డాక్యుమెంట్స్ ను సమర్పించేలా ఈ సభల్లో ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. నకిలీ ఓటర్లను తొలగించేందుకు, అర్హులైన ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించేందుకు భారత ఎన్నికల సంఘం ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను చేపట్టిందన్నారు. జనాభా గణన 2027లో భాగంగా మొదట ఇండ్ల గణన ప్రక్రియను ప్రస్తుతం నిర్వహిస్తున్నందున ఎన్నుమరేటర్లు ఏ ఒక్క ఇంటిని వదలకుండా నిర్దేశిత సమాచారాన్ని సేకరించాలన్నారు. అనంతరం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప వానాకాలం పంటలు, విత్తనాలు, ఎరువులు, వర్షపాతం, తదితర అంశాలపై క్షుణ్ణంగా మాట్లాడారు. సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేసి గ్రామ, వార్డు సభలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, పలువురు జిల్లా అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలి

**జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 3 (ప్రభాత ఉదయం)**

రాబోయే వానాకాలంలో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం జిల్లాలో వర్షాలు సాధారణంగా కురిసే అవకాశం ఉన్నప్పటికీ జూలై,ఆగస్టు నెలల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశమున్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో పంటల సాగు చేపట్టాలని సూచించారు.తేలికపాటి భూముల్లో కంది, పెసర, మినుము, పత్తి వంటి లోతైన వేర్లు కలిగిన మరియు తక్కువ వ్యవధి పంటలను సాగు చేయాలని, నల్లరేగడి భూముల్లో మొక్కజొన్న, జొన్న, పెసర,మినుము,మిరప వంటి పంటలను సాగు చేయాలని తెలిపారు.జూన్‌లో వర్షాలు బాగా పడ్డాయని తొందరపడి పంటల ఎంపిక చేయవద్దని,వర్షాభావ సమయంలో ఒక తడి నీరు అందించగల రైతులు మాత్రమే అధిక పెట్టుబడి పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని, భవిష్యత్తులో ఎరువుల పంపిణీ, పీఎం కిసాన్ తదితర ప్రభుత్వ పథకాల లబ్ధికి ఇది అవసరమని తెలిపారు.ఇప్పటివరకు నమోదు చేసుకోని రైతులు వెంటనే వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని కోరారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు మిశ్రమ,అంతర పంటల సాగు చేపట్టాలని,పంటల కీలక దశల్లో అవసరమైతే లైఫ్ సేవింగ్ ఇరిగేషన్ ఇవ్వాలని సూచించారు.రాబోయే ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి సంరక్షణ చర్యలు చేపట్టి, డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులు, మల్చింగ్ వంటి సాంకేతికతలను వినియోగించాలని తెలిపారు. గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వ్యవసాయ అధికారులకు ఆదేశించారు.పంట అవశేషాలను కాల్చరాదని హెచ్చరించారు.అలా చేయడం వల్ల భూసారం తగ్గడమే కాకుండా పర్యావరణానికి హాని కలుగుతుందని,నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు నానో యూరియాను వినియోగించి ఎరువుల వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించుకోవాలని సూచించారు.

# శ్రీరామ సీడ్స్ పేరుతో నకిలీ పత్తి విత్తనాలతో రైతులు మోసపోవద్దు

**కంపెనీ యాజమాన్యం హెచ్చరిక**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 3 (ప్రభాత ఉదయం)**

మల్దకల్ మండలంలోని బిజ్వారం, సద్దలోనిపల్లి, కాకులారం, నేతువానిపల్లి తదితర గ్రామాలలో కొంతమంది అక్రమార్కులు శ్రీరామ సీడ్స్ కంపెనీ పేరును వాడుకుంటూ నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్నట్లు కంపెనీ యాజమాన్యం దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో రైతుల సంక్షేమాన్ని కాపాడేందుకు నకిలీ విత్తనాల వల్ల రైతాంగం నష్టపోకుండా ఉండేందుకు శ్రీరామ సీడ్స్ యాజమాన్యం ఒక ప్రకటన విడుదల చేసింది. శ్రీరామ సీడ్స్ కంపెనీ ఈ సంవత్సరానికి (2026) సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి పత్తి విత్తనాలను అటు ఆర్గనైజర్లకు గానీ, ఇటు రైతులకు గానీ సరఫరా చేయలేదు. మార్కెట్లో శ్రీరామ సీడ్స్ వారి "988 వెరైటీ" అని చెప్తూ, బట్ట సంచులలో ప్యాక్ చేసి అమ్ముతున్న ఫౌండేషన్ పత్తి విత్తనాలకు, మా కంపెనీకి ఎలాంటి సంబంధం లేదు. అవి పూర్తిగా నకిలీ విత్తనాలు అని కంపెనీ యాజమాన్యం వెల్లడించింది. కొంతమంది స్వార్థపరులు కంపెనీ బ్రాండ్ పేరును అడ్డుపెట్టుకుని అమాయక రైతులకు నకిలీ విత్తనాలను అంటగడుతూ పెను దుమారానికి తెరలేపారు. ఇలాంటి నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి రైతులు మోసపోవద్దని యాజమాన్యం విజ్ఞప్తి చేస్తోంది.

"రైతు సోదరులారా, శ్రీరామ సీడ్స్ కంపెనీ నమ్మకానికి, నాణ్యతకు మారుపేరు. ఈ సీజన్‌లో మేము ఎలాంటి పత్తి విత్తనాలను మార్కెట్లోకి విడుదల చేయలేదు. బట్ట సంచులలో వచ్చే విత్తనాలను నమ్మి మీ పెట్టుబడిని, శ్రమను వృథా చేసుకోవద్దు. ఈ మోసపూరిత విక్రయాలపై వ్యవసాయ శాఖ అధికారులకు పోలీసులకు సమాచారం అందించి నకిలీ విత్తన నిర్మూలనకు సహకరించాల్సిందిగా కోరుతున్నాము.

**చట్టపరమైన చర్యలు**


కంపెనీ పేరును దుర్వినియోగం చేస్తూ నకిలీ విత్తనాలు అమ్ముతున్న అక్రమారులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునేందుకు యాజమాన్యం సిద్ధమవుతోంది. రైతులు విత్తనాలు కొనే ముందు అధికారిక డీలర్లను సంప్రదించాలని, ప్రలోభాలకు గురికావద్దని కోరారు.

# ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

## కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 3(ప్రభాత ఉదయం)**






ఈనెల 4న జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.బుధవారం కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులతో గూగుల్ మీట్ ద్వారా కలెక్టర్ మాట్లాడారు. ధరూర్ మండలం గుడ్డం దొడ్డి రిజర్వాయర్ వద్ద రెండు హెలిపాడ్స్ ను ఏర్పాటు చేయడంతో సీఎంతో పాటు మంత్రులకు స్వాగతం పలికేందుకు జిల్లా అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. పంపు హౌస్ లోపల సీఎం మీటింగ్ ఉంటుందని, వేదిక, ఇతర ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించేందుకు మెడికల్ టీం, అంబులెన్స్, ఫైర్ వాహనాలను సిద్ధంగా ఉంచాలన్నారు. జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ నోట్స్ తయారు చేసుకోవాలని, జిల్లా ప్రాజెక్టులతో కూడిన ప్రదర్శనకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని, కిందకు విద్యుత్ తీగలు వేలాడకుండా సరి చేయించాలన్నారు. సీఎం పర్యటనలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసు బందోబస్తును నియమించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డిఓ శ్రీనివాసరావు, డీఎస్పీ మొగిలయ్య, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608